రోడ్డెక్కిన వైద్యసేవలు

- నిలిచిన పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు
- గ్రంథాలయ ఆవరణలో సేవలందిస్తున్న సిబ్బంది

డోర్నకల్: స్థానిక శాంతినగర్‌లోని పీహెచ్‌సీ సబ్ సెంటర్–1 భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో రోడ్డు పక్కన సబ్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. బైపాస్ రోడ్డు పక్కన స్థలంతో పాటు శాంతిగనర్‌లో రూ.20లక్షల చొప్పున నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపట్టిన సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ 2023 ఆగస్టు 23న శంకుస్థాపన చేశారు. శాంతినగర్‌లో భవన నిర్మాణ పనులు శ్లాబ్ లెవల్‌కు పూర్తి కాగా బైపాస్ రోడ్డులో 80శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. శాంతినగర్‌లో భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో సంవత్సర కాలంగా అద్దె భవనంలో సబ్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం అద్దె భవనం


శాంతినగర్‌లో నిలిచిన సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు

మరమ్మతుల కోసం సబ్ సెంటర్‌ను ఖాళీ చేయించడం, ఇతర ప్రాంతాల్లో భవనం దొరకకపోవడంతో రోడ్డు పక్కన గ్రంథాలయ భవన ఆవరణలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సబ్‌సెంటర్‌లో ఇద్దరు ఏఎన్‌ఎంలు నలుగురు ఆశకార్యకర్తలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వైద్యుడు, ఏఎన్‌ఎం, ఎంసీహెచ్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతీ రోజూ బీపీ, షుగర్, గర్భిణీలు, బాలింతలు


రోడ్డు పక్కన గ్రంథాలయ భవన ఆవరణలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

వైద్య సేవల కోసం సబ్‌సెంటర్‌కు వస్తుండగా రోడ్డు పక్కన చెట్టు నీడలో సిబ్బంది సేవలందిస్తున్నారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ లెనిన్ ఉత్సవ్ టొప్పో డోర్నకల్‌లో పర్యటిస్తూ గ్రంథాలయం ఆవరణలో సేవలందిస్తున్న సిబ్బందిని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి


మహబూబాబాద్ అర్బన్: దరఖాస్తులను అందజేస్తున్న బద్రినారాయణ

మహబూబాబాద్ అర్బన్/తొర్రూరు: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో మంగళవారం సంఘం నాయకులు ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, గీత, హాల్యానాయక్, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు రామోజీనాయక్, సుజాత, కీర్తనరెడ్డి, నాయకులు శ్రీనివాస్, భవాని, సరిత, సుశీల, నాగరాజు, జినుగ విప్లవ్‌రెడ్డి, పులి ముత్తి లింగంగౌడ్, శంకర్‌నాయక్, రవీందర్, రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మరిపెడ రూరల్: మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంద పార్టీ ఎల్లంపేట గ్రామ అధ్యక్షుడు గండి వీరభద్రం అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేట పెద్ద చెరువులో గ్రామ మత్స్యకారులు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత చేపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మత్స్య సొసైటీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కెపాసిటర్‌లు వాడాలి



కేసముద్రం: వ్యవసాయబావుల వద్ద విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను వినియోగించాలని విద్యుత్ శాఖ డీఈ విజయ్ సూచించారు. మంగళవారం మండలంలోని అర్పనపల్లి గ్రామంలో గల వ్యవసాయ భూముల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాటలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ మల్లయ్య, ఏఈ రాజు, పెద్దాపురం, రవి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కళాకారుల జిల్లా కన్వీనర్‌గా భద్రయ్య



గూడూరు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం నుంచి జిల్లా కన్వీనర్‌గా గూడూరు మండలంలోని పొనుగోడుకు చెందిన మేరుగు భద్రయ్యను నియమిస్తున్నట్లు మంగళవారం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ యొల్ల పోశెట్టి ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి శంకరన్



నెహ్రూసెంటర్/గూడూరు: దళిత, గిరిజన, పీడిత ప్రజల ఆశాజ్యోతి ఎస్‌ఆర్ శంకరన్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శంకరన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ దుడ్డెల రాంమూర్తి, న్యాయవాదులు సత్యనారాయణ, నాయకులు శ్రీధర్, భాగ్యమ్మ , ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని యాదవనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీగడిమైసమ్మతల్లి దేవాలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మాదర బోయిన యాకయ్య, వైస్ చైర్మన్‌గా కదారి యాకయ్య, కోశాధికారిగా విజయ్ కుమార్, కమిటీ సభ్యులుగా సమ్మయ్య, కార్తీక్, ప్రదీప్, మల్లయ్య, సమ్మయ్య, సైదమ్మ, స్వరూప, జ్యోతి, సలహాదారులుగా రాము, శ్రీశైలం, వెంకన్న, వినయ్ ఎన్నికయ్యారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: ఈనెల 25న చలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు మృతి చెందితే ఖర్చుల నిమిత్తం రూ.30వేలు తక్షణ సాయం కింద ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు వారి ఖాతాలలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో తోట శ్రీను, చిరంజీవి, శ్రీకాంత్, వెంగళరావు, శ్రీను , వీరన్న, నాగేశ్వర్‌రావు, నజీర్ పాల్గొన్నారు.

కార్మికులను పర్మనెంట్ చేయాలి

తొర్రూరు రూరల్: మున్సిపాలిటీల్లో చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్


మహబూబాబాద్ అర్బన్: కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చేయాలని ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్, సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో పలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాంబయ్య, యాకన్న, వెంకట్రాం నర్సయ్య, సోమన్న, శంకర్, వెంకన్న, రాజశేఖర్, శ్యామ్, భిక్షపతి పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 24వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణంలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ చిరంజీవి మంగళవారం తెలిపాడు. వేలంపాటలో పాల్గొనే వారు వాహన ధరలో 50శాతం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మహబూబాబాద్ పేరుమీద డీడీ తీయాలని సూచంచారు. వాహనాలు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, బయ్యారం పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ఒక రోజు ముందుగా వచ్చి వాహనాలను చూసుకోవాలని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొని వేలంలో వాహనం వచ్చిన తర్వాత వాహనం తీసుకోని పక్షంలో అతని డీడీని ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఒక వేళ వేలంపాటలో పాల్గొని వాహనం రాకుంటే డీడీ వారికి తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



గార్ల: మండలంలోని పూమ్యాతండాకు చెందిన గూగులోత్ నాగేశ్వరరావు(40)పై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబల్ శ్యామ్ మంగళవారం తెలిపాడు. ఈనెల 15 వ తేదీన నాగేశ్వరరావు పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్తున్నానని చెప్పి, రాత్రి వరకు ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. కుమారుడు శ్రీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైండోవర్

నర్సింహులపేట: మండల కేంద్రంలో తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి మంగళవారం ఏడుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపాడు. అనంతరం పూచికత్తుపై విడుదల చేశామన్నారు.

హామీల అమలులో జాప్యం

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. పార్టీ నున్న నారాయణ, మల్లు స్వరాజ్యం శాఖ మహాసభల ప్రారంభ సూచికంగా అరుణ పతాకాన్ని ఎగుర వేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా హామీల అమలులో జాప్యం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని, క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించి పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, చీపిరి యాకయ్య, హేమానాయక్, నక్క సైదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

పోరాటయోధుడు కొమురం భీమ్


మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


బయ్యారం: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు


గార్ల: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్/బయ్యారం/గార్ల: కొమురం భీమ్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమురం భీమ్ అన్నారు.

పెండింగ్ డీఏ ప్రకటించాలి


కురవి: మాట్లాడుతున్న రమేశ్

కురవి: మృతి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేశ్ డిమాండ్ చేశాడు. మంగళవారం సంఘం సమావేశం మోద్గులగూడెం పాఠశాలలో సంఘం మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ఎన్నికల ముందు కారుణ్య నియామకాలను చేపడుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓదెల శివకుమార్, సీహెచ్.శ్రీనివాస్; గుగులోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

పెద్దవంగర: పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు దండిగుడి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాల్లో నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమేశ్, కోటేశ్వర్, సురేందర్, శివకుమార్, ప్రభాకర్, యుగేందర్, మల్లేశం, రాజేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

కేసముద్రం: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వోమ సంతోష్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రధాని అభినందనలు

గూడూరు: మండలంలోని గుండెంగ యూపీఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులకు మంగళవారం ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి అభినందనల ఉత్తరాలు వచ్చాయి. సెప్టెంబర్ 17న పీఎం నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా గుండెంగ ఎంపీయూపీఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు, గైడ్ టీచర్ కొడిపాక రమేష్ ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ హిందీ భాషలో లేఖలు పీఎం కార్యాలయానికి పోస్టు ద్వారా పంపించారు. ఈ లేఖలకు స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం తిరిగి విద్యార్థులను అభినందిస్తూ ప్రధానమంత్రి అభినందనల లేఖలను పంపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, కటి శ్రీనివాస్‌గౌడ్, దామోదర్, మాలు, బోడ కిషన్‌నాయక్, సతీష్, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అభినందన ఉత్తరాలు చూపుతున్న విద్యార్థులు

క్రైం కార్నర్..

ఎదురెదురుగా ద్విచక్రవాహనాల ఢీ.. ఒకరి పరిస్థితి విషమం



మరిపెడ రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈసంఘటన మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ శివారులో మహబూబాబాద్–సూర్యాపేట 365 జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం ఉస్నేన్‌బాద్‌కు చెందిన చక్రాల వెంకన్న, చక్రాల నర్సయ్య సోదరులు వారి ద్విచక్రవాహనంపై కురవి మండలం అయ్యాగారిపల్లి గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి మరిపెడ మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనం వారి వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వెంకన్న, నర్సయ్య సోదరులకు గాయాలు కాగా, మరో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిగా తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా క్షతగాత్రులుకు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వాహనంలో తరలిస్తుండగా తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయిన గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.20వేల నగదు, సెల్ ఫోన్ సేకరించిన సిబ్బంది పటాన్, ఉపేందర్‌లు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్, పోలీస్ కానిస్టేబుల్‌కు నగదు, సెల్ ఫోన్ అప్పగించి మానవత్వం చాటుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

నెల్లికుదురు: ద్విచక్రవాహనాన్ని బొలేరో వాహనం ఢీకొట్టిన ఘటనలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న తండ్రి కొడుకులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఆలేరు గ్రామ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన కోరే హరీశ్ తన తండ్రి బీరయ్యతో కలిసి స్కూటి మీద ఆలేరు స్టేజి వద్ద నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో పని చేస్తున్న బనవాసి జమదగ్ని బొలేరో అతివేగంగా రాంగ్‌రూట్లో వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తునట్లు ఎస్సై వివరించారు. బాధితుడు బీరయ్య కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడి తల్లి కాంతి, భార్య నందిని తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని బయ్యారం మండలం సంతులాల్ పోడుతండాకు చెందిన గుగులోత్ మహేష్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ రోడ్డులో రెండేళ్లుగా ఎంఆర్ గోల్డ్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు సుమారు 30నుంచి 40మంది వద్ద రూ.2కోట్లకు పైగా అప్పు తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వారికి అధిక మొత్తంలో వడ్డీలు కట్టడంతోపాటుగా బంగారం కూడా ఇచ్చాడు. అప్పులు తీరకపోగా ఒత్తిడితో పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

బాలింత మృతి

నెహ్రూసెంటర్: ప్రసవానికి వచ్చిన ఓ మహిళా పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చిన అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన బొర్రోతు రాజేశ్వరీ (21) మొదటి కాన్పు కోసం సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లింది. మంగళవారం ఉదయం వైద్యులు ఆపరేషన్ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తీవ్ర అస్వస్థతకు గురికాగా వైద్యులు చికిత్స చేశారు. గుండె సంబంధిత వైద్యులను రప్పించి చికిత్స అందించినప్పటికీ రాజేశ్వరీ మృతి చెందింది. సంఘటనపై ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ జగదీశ్వర్‌ను వివరణ కోరగా.. ప్రసవం అనంతరం మృతురాలు రాజేశ్వరీ గుండె సక్రమంగా పని చేయకపోవడంతో స్పృహ కోల్పోయిందన్నారు. వెంటనే వైద్యం ప్రారంభించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పెండింగ్‌లో ఉన్న మన ఊరు–మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశాడు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో పనులను సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, అఖిల్, మహేశ్, వినయ్, ప్రమోద్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

గూడూరు: ఈపాస్ ద్వారానే నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల క్రయవిక్రయాలు జరపాలని మహబూబాబాద్ ఏడీఏ అజ్మీర శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం మండల ఏఓ అబ్దుల్ మాలిక్‌తో కలిసి తనిఖీ చేశారు.

ఎక్స్‌లెన్సీ అవార్డు ప్రదానం

కేసముద్రం: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ, స్కైలైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతియేటా రాష్ట్రస్థాయిలో అందించే టీచర్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఇనుగుర్తి మండలం కోమటిపల్లి జెడ్పీ హైస్కూల్‌కి చెందిన మ్యాథ్స్ ఉపాధ్యాయుడు ఇల్లెందుల నరేందర్ ఎంపికయ్యాడు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పెద్దవంగర: బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్ని గ్రామాల నుంచి స్పందన లభిస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని బూత్ అధ్యక్షుడు రాంపల్లి హరీశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని గాంధీపురం జీపీ శివారు వెంకట్రాంతండా జీపీ, నారాయణపురం యూపీఎస్, కల్వల గ్రామ పీఎస్, క్యాంపుతండా పీఎస్‌లను ఎంఈఓ యాదగిరి మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

డోర్నకల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ప్రతీ ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ కోరారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఓటు హక్కు నమోదు పత్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ పవన్‌కళ్యాణ్, రాజేష్, సాయికుమార్, సుమన్, గోపిసింగ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కవి మృతి



గార్ల: గార్లకు చెందిన ప్రముఖ కవి, రచయిత, బూడిద అరుణ్‌గౌడ్(59) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడు ఎంపీఓగా విధులు నిర్వహిస్తూ, ఆరోగ్యం సహకరించక పోవడంతో వలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకొని కుమారుడికి తన ఉద్యోగం పెట్టించాడు.

క్రీడా సామగ్రి పంపిణీ

డోర్నకల్: స్థానిక కస్తూర్బా విద్యార్థినులకు ప్రజాహోటల్ నిర్వాహకుడు మామిడి నాగరాజు క్రీడా సామగ్రి పంపిణీ చేశాడు. నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన కుమారుడు మామిడి వివేక్ జయంతి పురస్కరించుకుని పంపిణీ చేశాడు.

ఐదుగురి రిమాండ్

చిన్నగూడూరు: కత్తులతో దాడి చేసుకున్న ఘటనలో ఐదుగురి వ్యక్తులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో దసరా రోజు ఇరువర్గాలు కత్తులతో దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుతో మొత్తం పదిహేను మందిపై కేసు నమోదు కాగా ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పంట నష్ట పరిహారంలో గందరగోళం

నెల్లికుదురు: మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో చెరువు కట్ట తెగిపోయి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించే పరిహారంలో గందరగోళంగా ఉందని బాధిత రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు రైతులు మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా నష్టం జరగని రైతులకు పరిహారం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సయ్య, ప్రతాప్, మధుకర్, మహేష్, ప్రవీన్, సోమయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో రెండేళ్ల బాలుడు మృతి

కేసముద్రం: అనారోగ్యంతో రెండేళ్ల బాలుడు మృతి చెందిన విషాధ సంఘటన మండలంలోని సబ్‌స్టేషన్‌తండాజీపీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోతు హరీశ్, కస్తూరి దంపతులకు ఒక కూతురు, కుమారుడు జయంత్(2) ఉన్నారు. కొద్దిరోజులుగా జయంత్ అనారోగ్యంతో బాధపడుతుండగా, పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో బాలుడు తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పుట్టిన రెండేళ్లకే, నీకు నూరెళ్లు నిండాయా అంటూ కొడుకును పట్టుకుని ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు అందర్నీ కలచివేసింది.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని వినతి



మరిపెడ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మండలంలోని ఆనెపురం స్టేజి భారతివిద్యా మందిర్ హైస్కూల్ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని ఏఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం డీఈఓ రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ.. పాఠశాలలో 850 మంది విద్యార్థులు ఉండగా, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో ఏజెంట్లను పెట్టుకొని విద్యార్థుల తల్లిదండ్రులను పీడించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సాయి, మధు, నందు పాల్గొన్నారు.